క్లుప్తంగా

నేడు మహిళా మహోత్సవం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శనివారం మహిళా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్ డాక్టర్ కె. రూతు రమ్య శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా ఐపీఎస్ అధికారిణి సరిత తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రత కీలకమని వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రై డే- డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాల్లోని నీటి తొట్లు పరిశీలించారు. శుభ్రంగా లేని వాటిలోని నీరు తొలగించారు. పరిసరాలు శుభ్రం చేయించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గంజాయి పట్టివేత



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, గుండిమెడ శివారులో మంగళగిరి ఎక్సైజ్ అధికారులు గంజాయిని పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ జి. వీరాంజనేయులు మాట్లాడుతూ.. వడ్డేశ్వరం, గుండిమెడ రోడ్డు మలుపులో గంజాయి తాగుతున్నారని సమాచారం అందడంతో ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నయనతార, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశామన్నారు. ముగ్గురు యువకులు చిక్కారని, 120 గ్రాముల గంజాయి లభించిందని చెప్పారు. నిందితులను గుండిమెడకు చెందిన పాత నేరస్తులైన కుంభా నాగవెంకటేష్, గుండిమెడ జోజిబాబు, నూర్జాపూర్ సూరజ్ కుమార్‌లుగా గుర్తించామన్నారు. వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో తగిన శ్రద్ధ పెట్టకపోవడంతో ప్రతి ఒక్కరు శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. గ్రామ పెద్దలు సూరిబాబు, గుడి చైర్మన్ వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి సామిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. సమన్వయకర్తలుగా పీవీ సత్యనారాయణ, టి.శివకృష్ణ, ఆర్గనైజర్‌గా మహమ్మద్ నూర్, మహాలక్ష్మి, సేఫ్ లైఫ్ క్లబ్ టీం సభ్యులు వ్యవహరించారు.

కొనసాగుతున్న జన సేవాదళ్ శిక్షణ



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో సీపీఐ అనుబంధ విభాగం జన సేవాదళ్ శిక్షణ కొనసాగుతోంది. రెండవ రోజు శుక్రవారం శిక్షణ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లుగా నార్ల వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, హుమశంకర్, మురళీలు వ్యవహరించారు. యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. నాయకులు చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అవార్డు



మేడికొండూరు: మండలంలోని మందపాడు గ్రామంలోని శ్రీనివాస హై స్కూల్లో సోషల్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రెబ్బవరపు శిరీష డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతీయ ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. జలాల్ పురం గ్రామానికి చెందిన శిరీష 12 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ, అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్య, సామాజిక సేవా రంగంలో కృషి చేసినందుకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా అవార్డును వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నున్నట్లు తెలిపారు. శిరీషకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ లోడుపై 'అదనపు' రాయితీ

అవసరానికి మించి విద్యుత్ వాడే వినియోగదారులకు ఆ శాఖ మంచి అవకాశం కల్పించింది. లోడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ వెసులుబాటు ఇచ్చింది. జూన్ 30వ తేదీలోపు క్రమబద్ధీకరణ చేసుకుంటే 50 శాతం రాయితీ ఇస్తోంది.

- గృహ వినియోగదారులకు సదవకాశం
- అధికలోడు క్రమబద్ధీకరణకు సగం రాయితీ



విద్యుత్ రెవెన్యూ కార్యాలయం

మంగళగిరి : ప్రస్తుతం చాలామంది గృహాలలో ఎయిర్ కండీషనర్లు వాడుతున్నారు. వేసవి కాలం కావడంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. సాధారణంగా గృహాలకు కనెక్షన్ తీసుకునే సమయంలో ఎంత విద్యుత్ వాడుతారో చెప్పాలి. బల్బులు, ట్యూబ్ లైట్లు, ఫ్రిజ్, మిక్సీ, గ్రైండర్, వాషింగ్ మెషిన్, గీజర్లు, హీటర్లు తదితరాలు కలిపి విద్యుత్ లోడును కిలోవాట్లలో లెక్కించి దాని ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారు. కొంతమంది వినియోగదారులు ఈ ఆర్థిక భారం తగ్గించుకునేందుకు దరఖాస్తులో కేవలం బల్బులు, లైట్లు మాత్రమే చూపిస్తారు. కిలోవాట్ నుంచి రెండు కిలోవాట్లకు అనుమతులు తీసుకుంటారు. దీంతో తక్కువ మొత్తంతో కనెక్షన్ వస్తుంది. ఇలా చేయడం వలన ఆ వీధిలో ఈ లెక్కల ప్రకారమే అందుకు తగిన సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. వాస్తవంగా చూసుకుంటే అన్ని ఇళ్లలో పలు గృహోపకరణాలు వినియోగిస్తున్నారు. దాంతో ట్రాన్స్‌ఫార్మరుపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, ఒక్కోసారి లో ఓల్టేజీ వంటి సమస్యలు వస్తాయి.

తనిఖీలు చిక్కితే జరిమానా

కొన్నేళ్ల క్రితం ఇచ్చిన కనెక్షన్‌లతో పోలిస్తే ప్రస్తుతం మూడు, నాలుగు రెట్లు విద్యుత్ వినియోగం పెరిగింది. విద్యుత్ సిబ్బంది తనిఖీలకు వచ్చినప్పుడు మీ కనెక్షన్ అదనపు లోడు కింద చూపిస్తే అది నేరం అవుతుంది. అధిక లోడు చూపించినప్పుడు విద్యుత్ సిబ్బంది జరిమానా విధిస్తారు. ఈ సమస్యను అధిగమించాలంటే క్రమబద్ధీకరణ చేసుకోవాలి. గతంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి విద్యుత్ వాడకాన్ని లెక్కించేవారు. ఎక్కువ లోడు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే డెవలప్‌మెంట్ చార్జీతోపాటు జరిమానా విధించేవారు. ఇప్పుడు వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే సగం రాయితీ లభిస్తోంది. జూన్ 30వ తేదీ వరకు గడువు ఉంది. ఆ తర్వాత సిబ్బంది తనిఖీలు చేసి జరిమానా విధిస్తారు.



32 కేవీ సబ్‌స్టేషన్

ఈ వివరాలు ముఖ్యం

విద్యుత్ బిల్లులపై ప్రస్తుతం ఎన్ని కిలోవాట్లు డిపాజిట్ చెల్లించారో ఉంటుంది. ప్రస్తుతం ఇంటిలో వినియోగిస్తున్న వాటిని లెక్కించి అందుకు అదనంగా డిపాజిట్ చెల్లించాలి. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో 1.47 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అధిక లోడు వాడుతున్న వినియోగదారులు క్రమబద్ధీకరణకు డిమాండ్ నోటీసు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకుని స్థానిక సబ్ స్టేషన్‌లో అందిస్తే రాయితీ ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



గృహ విద్యుత్ వినియోగదారులు ఈ 50 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లోడు క్రమబద్ధీకరణ చాలా మంచిది. గతంలో వినియోగాన్ని బట్టి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేవారు. కాలానుగుణంగా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. క్రమబద్ధీకరణ చేసుకుంటే లో ఓల్టేజీ సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. జూన్ 30వ తేదీలోపు రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– సురేష్ బాబు, ఏడీఈ, మంగళగిరి

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం



కుంచనపల్లిలో వేడుకల్లో పాల్గొన్న జొన్న శివశంకరరావు తదితరులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కుంచనపల్లిలో తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జెండాను రైతు సంఘం కుంచనపల్లి గ్రామ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ అనేక రైతాంగ పోరాటాలలో ఏఐకేఎస్ ముందుండి నిలబడిందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు పల్లెకృష్ణ, నాయకులు బక్కిరెడ్డి, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, బడుగు వెంకటేశ్వరరావు, ఎనుమల సాంబయ్య, సుబ్బారావు, బద్రి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో....

తాడేపల్లి పట్టణ పరిధిలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరావు ఆధ్వర్యంలో శుక్రవారం అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తమ్మా నరసారెడ్డి జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రం చర్యలు తప్పుబట్టారు. సాగు రంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గోపాల్ రెడ్డి, దశరథ రెడ్డి, బుల్లికోటి రెడ్డి, మేక అమరారెడ్డి, బండాపు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో.......

తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై. కేశవరావు, కౌలు రైతు సంఘం నాయకుడు వి.కృష్ణయ్యలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు టి. బక్కిరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కంచర్ల జేమ్స్, కొండా సుబ్బారెడ్డి, బి. గోపిరెడ్డి, పార్వతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాజలో...

మంగళగిరి: కాజలో శుక్రవారం రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజలోని రెండు సెంటర్లలో రైతు సంఘం నాయకులు జెండాలు ఆవిష్కరించారు. నాయకులు సింహాద్రి చిన్న లక్ష్మారెడ్డి, జొల్లా వేమారెడ్డి, గాదే మాధవరెడ్డి, భీమిరెడ్డి పేరిరెడ్డి, అప్పికట్ల ప్రకాశరావు, రామారావు, పాలేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



తాడేపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మంగళగిరి టౌన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి అనూష అన్నారు. క్లీన్ ఎర్త్ - క్లీన్ ఇండియా నినాదంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునివ్వడంతో మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాల సామాజిక కుటుంబ వైద్య విభాగం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. వారికి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎయిమ్స్ సీఎఫ్ఎం విభాగ సీనియర్ అసిస్టెంట్ డాక్టర్ రశ్మిత, జూనియర్ అసిస్టెంట్ డాక్టర్ హాసిని, డాక్టర్ సుభిక్ష, ఎయిమ్స్ వైద్యులు ఆర్యన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఇంటి స్థలం విక్రయించొచ్చు: మంత్రి



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి నారా లోకేష్

మంగళగిరి: ప్రభుత్వం ఇస్తున్న ఇంటి పట్టాలతో రెండు సంవత్సరాల తర్వాత స్థలాలను విక్రయించుకునే అవకాశం కల్పించామని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం నగర పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు వద్ద ఏర్పాటు చేసిన ప్రాంగణంలో మంత్రి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా అభివృద్ధి చేస్తామన్నారు. వంద పడకల ఆసుపత్రికి ఈ నెల 13వ తేదీన శంకుస్థాపన చేసి ఏడాదిలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. నగరంలో పార్కులు, చెరువులు, కమ్యూనిటీ హాళ్లు, లక్ష్మీనృసింహస్వామి ఆలయం, శివారు కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆకుల జయసత్య, మాజీ కౌన్సిలర్ వింజమూరి ఆషాబాల, మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దామర్ల రాజు, జగ్గారపు రాము తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని ర్యాలీ



నిరసన ర్యాలీలో ముస్లింలు

తాడేపల్లి రూరల్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని తాడేపల్లి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని నులకపేట మసీద్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ బిల్లు రద్దు అయ్యేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యుద్ధమని అన్నారు. టీడీపీ, జనసేన పార్టీల వైఖరి లౌకికతత్వానికి విఘాతం కలిగించేలా ఉందన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పఠాన్ ఖాసింఖాన్, మహమ్మద్ గోరేబాబు, షేక్ శ్రీను బాషా, సలీం బాషా, సయ్యద్ సర్దార్, సుభాని, ఇమ్రాన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



గ్రంథాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ బీఏ (ఐఏఎస్) విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఆధునిక తెలుగు సాహిత్యంపై నిర్వహించిన తెలుగు అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ప్రపంచ తెలుగు రచయితల ప్రధాన కార్యదర్శి డా.జి.వి. పూర్ణచంద్ మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా సాహిత్యం మారుతూ వస్తోందన్నారు. కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ విద్యాధికారి డాక్టర్ టి. జాన్ కిరణ్ బాబు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. వర్సిటీ బీఏ (ఐఏఎస్) విభాగ అధిపతి డాక్టర్ బి. శివనాగయ్య చక్కని శిక్షణ ఇస్తున్నారు. యాజమాన్యం ముద్రించిన సివిల్ సర్వీసెస్ సి.సాట్, (రీజనింగ్, అర్థమెటిక్) గ్రంథాన్ని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా విభాగంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ దేవీప్రసాద్, విశ్వవిద్యాలయ రీసెర్చ్ మరియు డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ బి.టి.పి. మాధవ్‌లు ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. అంతర్జాతీయ సదస్సు ఉప సంచాలకులు డాక్టర్ అద్దంకి ప్రజాపతి సదస్సు లక్ష్యాన్ని తెలియజేస్తూ, నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సమతుల ఆహారం అందించాలి



తాడికొండ: కిశోర బాలికలకు సమతుల ఆహారం అందించాలని, గర్భిణులు తొలి నుంచి పోషకాహారం తినాలని ఐసీడీఎస్ మందడం సెక్టార్ సూపర్‌వైజర్ కె. సీతారావమ్మ అన్నారు. శుక్రవారం మందడం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా 1000 రోజుల సంరక్షణపై ఆమె వివరించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె.శాంతిభూషణ గోపి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో మహిళలు టోల్‌ఫ్రీ నంబర్లు 181, 1098కు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సంస్థ చిన కోటేశ్వరరావు, డీసీపీవో కార్యాలయ సిబ్బంది జి రవి, అంగన్ వాడీలు సిబ్బంది పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు పూలే కృషి

- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జయంతి వేడుకలు
- ఘనంగా నివాళులర్పించిన వేమారెడ్డి, మురుగుడు



దుగ్గిరాల: పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ జబీన్

మంగళగిరి: సమ సమాజ స్థాపనకు మహాత్మ జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళాభివృద్ధి కోసం పూలే కృషి చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన పూలే దంపతులు మహిళలకు చదువు చెప్పించి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఊట్ల పాల శ్రీనివాసరావు, దివ్యాంగ విభాగం అధ్యక్షుడు బొక్కా అగస్టీన్, మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి రూరల్ మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, అమరా నాగయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు పూజాల మనోహర్, జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా నాయకురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎంపీపీ జబీన్ పాల్గొన్నారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల, ఈఓపీఆర్‌డీ కె.జె.నెహ్రూ, చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో....

ఫిరంగిపురం: పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శివయ్య, మండవ చిన నరసింహారావు, కె. కోటేశ్వరరావు, కె.రామకోటేశ్వరరావు, బి.సతీష్‌బాబు, జి. చంద్రం, పి.థామస్, పి.దివ్య, ఆరె పున్నారెడ్డిలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, గౌరవ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తిలు ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని అన్నారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం నాయకులు వడ్డేశ్వరం లక్ష్మణ్, చంద్రరావు, ప్రసాద్, బుల్లు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో.....

తాడేపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో పార్టీ స్థానిక కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, నాయకులు తాడిబోయిన భాస్కర్, ఇట్టా పెంచలయ్య, పీటర్ పాల్, తాడిబోయిన గోపి, తురక దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మహిళా విద్యకు విశేష కృషి చేసిన సంఘ సంస్కర్త పూలే అని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ కమిషనర్ శకుంతల, ఆర్వో బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

- బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఓబీసీ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షులు తులిమిల్లి రామకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- నగర పరిధిలోని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, రాష్ట్ర యువజన కార్యదర్శి హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపరిమి (తాడికొండ): బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ స్టడీ సెంటర్ నిర్వాహకులు, మాజీ ఎంపీటీసీ దావులూరి పోతురాజు ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక మార్పుల కోసం పోరాడిన మహనీయుడు పూలే అన్నారు. స్టడీ సెంటర్ ఉపాధ్యాయులు కావూరి గోపి, రాజేశ్వరి, అభిషేక్ , పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



తాడేపల్లి రూరల్: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మంగళగిరి: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



నివాళులర్పిస్తున్న స్టడీ సెంటర్ నిర్వాహకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండాలయపేట, కొత్తపేట, ఆర్ అండ్ బీ బంగ్లా, హాస్పిటల్ రోడ్డు, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేట్, ఏకో పార్కు, నాంచారమ్మ చెరువు, తెనాలి రోడ్డు, పెద కోనేరు, హుస్సేన్ కట్ట, బైపాస్ రోడ్డు, రత్నాల చెరువు, లక్ష్మీనృసింహ కాలనీ, శ్రీశైలనగర్, ఆత్మకూరు, వడ్లపూడి, అక్షయ పాత్ర ఏరియా, జీఆర్ స్కూలు, ఎన్‌సీసీ రోడ్డు, పాత మంగళగిరి, టిప్పర్లబజార్, మన్యం బజార్, మార్కండేయ కాలనీ, కుబేర రైస్ మిల్లు, రాయల్ కన్వెన్షన్, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, కొత్తపాలెం, చినకాకాని, హాయ్‌ల్యాండ్ రోడ్డు, కాజ, ఆత్మకూరు, శర్మ దాబా, అంబేడ్కర్ కాలనీ, ఉండవల్లి సెంటర్, జామ ఆయిల్ తోట, రామకృష్ణ హాల్ ఏరియా, సాయినగర్ కట్ట, సీతానగరం, కేఎల్ రావు కాలనీ, గవర్నమెంట్ హాస్పిటల్, బోటు యార్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఫిరంగిపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు.

దుగ్గిరాల: శాఖాపరమైన పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. దుగ్గిరాల, పెదపాలెం, చిలువూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో కరెంటు ఉండదని ఏఈ వసంతరావు ప్రకటనలో తెలిపారు.

శిక్షణతో ఉన్నత స్థాయికి చేరిక

ఫిరంగిపురం: శిక్షణ ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కళాశాల కరస్పాండెంట్ మద్దు బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో పదో తరగతి, ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమాన్ని శుక్రవారం ఫాదర్ మద్దు బాలస్వామి పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్ హరినాథరెడ్డి, ఆంగ్ల బోధకుడు కోటా నాయక్, కంప్యూటర్ శిక్షకులు రవీంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ పన్ను చెల్లించవచ్చు

మంగళగిరి టౌన్: ప్రజలు సెలవు రోజుల్లో కూడా ఆస్తిపన్ను, నీటిపన్ను, ఖాళీ జాగాల పన్నుల చెల్లింపుకు నగరపాలక సంస్థ కార్యాలయం అవకాశం కల్పిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పన్ను పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

మంగళగిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారంగా పెంచిన పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల్ని సమీకరించి ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ మేరకు పార్టీ పట్టణ కార్యదర్శి జవహర్ లాల్, జిల్లా నాయకులు చెంగయ్య, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, బాలకృష్ణ ప్రకటన విడుదల చేశారు.